# దేశం గర్వించే స్థాయిలో తెలంగాణ



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి

- ప్రజల తీర్పును గౌరవిస్తున్నాం
- సమస్యలపై పోరాటంలో ముందుంటాం
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 3: కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధిలో దేశం గర్వించే స్థాయిలో నిలిచిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఆదివారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని చెప్పారు. తెలంగాణ సాధనే ధ్యేయంగా కేసీఆర్ నాడు యావత్ ప్రజలందరినీ ఏకం చేసి, అకుంఠిత దీక్షతో రాష్ట్రాన్ని సాధించారన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని దేశానికే మార్గదర్శకంగా నిలిపారని కొనియాడారు. రైతాంగానికి నిరంతర విద్యుత్, సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. రైతుబంధు అందించి వ్యవసాయాన్ని పండుగలా మార్చిన మహనీయుడు అని పేర్కొన్నారు. అన్నివర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారన్నారు. ఆసరా పింఛన్‌తో ఒంటరి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులను ఆదుకున్నారన్నారు. విద్య, వైద్య రంగాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించారని తెలిపారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా వైద్య సహకారం అందించారన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించారన్నారు. ఆటో డ్రైవర్లు, గీతా కార్మికుల పన్నులను ఎత్తివేసి ఆయా వర్గాల కుటుంబాలకు అండగా నిలిచారన్నారు. కులవృత్తులకు ఆదరణ కల్పించి ఆర్థిక సహకారం అందించారని తెలిపారు. ప్రజల తీర్పును తాము శిరసా వహిస్తున్నామని చెప్పారు. ప్రజల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామన్నారు. ఉద్యమ కాలం నుంచి ప్రజల కోసం బీఆర్‌ఎస్ పోరాటం చేస్తున్నదన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కేటీఆర్ విజయంలో భాగస్వాములైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువతకు కృతజ్ఞతలు తెలిపారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మాట్లాడుతూ, కేటీఆర్ విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలతోపాటు విజయంలో భాగస్వాములైన ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో పదేండ్లలో రాష్ట్రం విశేష అభివృద్ధి సాధించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలు ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి అభివృద్ధిని కొనసాగించాలని సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, నాయకులు కల్వకుంట్ల గోపాల్‌రావు, సత్తార్, మ్యాన రవి, కుంబాల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్యూలో దర్శనంకోసం నిల్చున్న భక్తులు



కోడెమొక్కు తీర్చుకుంటున్న భక్తులు

# రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- 25 వేలకు పైగా భక్తుల రాక
- రాజన్నకు రూ.17 లక్షల ఆదాయం

కోడె మొక్కుల చెల్లింపు



వేములవాడ టౌన్, డిసెంబర్ 3: కార్తీకమాసం సందర్భంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో రద్దీగా కనిపించింది. వేకువజాముననే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలను సమర్పించుకున్నారు. జిగ్‌జాగ్ క్యూలో నిలబడి కోడె మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో కుంకుమపూజలు, గండదీపం, కల్యాణ మొక్కులు, సత్యనారాయణ వ్రతాలు, చండీహోమాలు ఘనంగా నిర్వహించుకున్నారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా రాజన్నకు రూ.17 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. 25 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని వెల్లడించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కార్తీకదీపాలు వెలిగించిన భక్తులు

# ఈ విజయం ప్రజలదే

- ఆరు గ్యారెంటీల అమలుకు కృషి చేస్తా
- నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరిస్తా
- ఆదరించి గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటా
- వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ, డిసెంబర్ 3 : ఈ ఎన్నికలో గెలుపు ప్రజలదేనని వేములవాడ ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సాయంత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికి నాలుగు సార్లు ఓటమిపాలైనప్పటికీ అధికారం, పదవులతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజల మధ్య ఉండి ప్రజలలో ఒకడిగా ఉన్నానని చెప్పారు. ఇది గుర్తించిన ప్రజలు కృతజ్ఞతగా తనకు ఎమ్మెల్యేగా పట్టం కట్టారని తెలిపారు. 30 సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజల సమస్యలపై పోరాడుతున్న తనకు ప్రతి అంశం, ప్రతి సమస్యపై అవగాహన ఉందని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలన పోయి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతున్నందున ప్రతి సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా 6 గ్యారంటీలను అమలు చేసి తీరుతామని, ప్రతి సంక్షేమ పథకాన్ని లబ్ధిదారులకు పారదర్శకంగా అందిస్తామని తెలిపారు. ప్రతిక్షణం ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. తనను గెలిపించిన ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటూ ప్రతిక్షణం ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

## ఈటలకు కమలాపూర్ మొండిచెయ్యి

హుజూరాబాద్/టౌన్, డిసెంబర్ 3: ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ ఎన్నికల్లో బీజేపీ తరపున బరిలో నిలచిన ఈటల రాజేందర్‌కు సొంత మండల ప్రజలే మొండి చెయ్యి చూపారు. అక్కడ ఆరు రౌండ్లు ఉండగా చివరి మూడు రౌండ్లలోనే స్వల్ప ఆధిక్యతను ప్రజలు కట్టబెట్టారు. ఎన్నికల సరళిని పరిశీలిస్తే బీఆర్‌ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి వైపే కమలాపూర్ ప్రజలు మొగ్గు చూపారు. మొత్తంగా చూసుకుంటే 22 రౌండులలో 19 రౌండ్లు కౌశిక్‌రెడ్డి ఆధిక్యత చూపారు. కౌశిక్‌రెడ్డికి 80,333 ఓట్లు రాగా, ఈటల రాజేందర్‌కు 63,460 ఓట్లు రావడంతో ద్వితీయ స్థానానికి పరిమితమయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి వొడితల ప్రణవ్‌కు 53,164 ఓట్లు వచ్చాయి. మొదటి రౌండు నుంచి ఆధిక్యత కనబర్చిన పాడి కౌశిక్‌రెడ్డి 19వ రౌండ్ వరకు 17,937 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. అయితే చివరి రౌండ్లలో ఈటలకు స్వల్ప ఆధిక్యత రాగా, ఆఖరు లెక్కింపులో 16,873 ఓట్లతో పాడి కౌశిక్‌రెడ్డి విజయం సాధించారు. నియోజకవర్గంలో ఐదు మండలాల్లో ప్రతి మండలంలో కౌశిక్‌రెడ్డికి మెజార్టీ ఓట్లు రావడం విశేషం. ఎక్కడ కూడా కౌశిక్‌రెడ్డికి ప్రత్యర్థులు సరైన పోటీని ఇవ్వలేకపోయారు.

## వెల్లివిరిసిన ఓటర్ల చైతన్యం

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 3: హుజూరాబాద్ శాసనసభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో ఓటర్లలో ఓటు హక్కు వినియోగంపై చైతన్యం వెల్లివిరిసింది. గత ఉప ఎన్నికలప్పుడు సుమారు 1600 వరకు నోటాకు ఓట్లు పోలవగా, ఈ ఎన్నికల్లో కేవలం మూడే ఓట్లు పడడం ఓటర్ల స్పష్టమైన తీర్పుకు ప్రతీకగా నిలిచింది. అలాగే 2021 అక్టోబర్‌లో జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో సుమారు 2300కు పైగా చెల్లని ఓట్లు పోలవగా ఈసారి ఈ ఎన్నికల్లో కేవలం 325 ఓట్లు మాత్రమే రిజెక్ట్ అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఏదేమైనా గత ఉప ఎన్నికలతో పోల్చుకుంటే ఓటర్లు తమ ఓటు హక్కును వృథా చేయకుండా ఎంతో జాగ్రత్తగా వ్యవహరించారు. సరైన అభ్యర్థిని ఎంచుకొని తమ ఓటు వేసి స్పష్టమైన తీర్పు ఇచ్చారు. పోస్టల్ ఓట్లలో కూడా గత ఉప ఎన్నికలప్పుడు రెండు వేలకు పైగా ఓట్లు వేసిన ఉద్యోగులు, ఈసారి కొంత తగ్గినప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థి వొడితల ప్రణవ్‌కు 703 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 615, విజేత అయిన బీఆర్‌ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డికి 330 పోస్టల్ ఓట్లు పోల్ అయ్యాయి. అలాగే బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి పల్లె ప్రశాంత్‌గౌడ్‌కు 27, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థికి ఆరు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థికి ఒకటి, న్యూ ఇండియా పార్టీ అభ్యర్థికి రెండు, ఇండిపెండెంట్లు ఇమ్మడి సతీశ్‌కు ఒకటి, గట్టయ్యయాదవ్‌కు ఒకటి చొప్పున పోస్టల్ ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ ఓట్లలో మాత్రమే ప్రభావం చూపిన కాంగ్రెస్ అభ్యర్థి ఏ ఒక్క రౌండులో అధిపత్యం చూపకపోగా, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కేవలం రెండు రౌడ్లలో స్వల్ప మెజార్టీ కనబర్చారు. నియోజకవర్గ ఓటర్లు అధికార పార్టీ అభ్యర్థి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి స్పష్టమైన మెజార్టీ ఇచ్చి పార్టీపై తమకు నమ్మకాన్ని ఓటు రూపంలో ప్రదర్శించారు.

## కాంగ్రెస్ నాయకుల సంబురాలు

ఇల్లంతకుంట, డిసెంబర్ 3 : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అన్ని గ్రామాల్లో ఆదివారం సంబురాలు జరుపుకొన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యేగా డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ 31 వేల పైగా మెజార్టీ సాధించారు.

సైదాపూర్, డిసెంబర్ 3: హుస్నాబాద్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గెలుపొందడంపై మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆపార్టీ నాయకులు సంబురాలు జరుపుకొన్నారు. ఈసందర్భంగా పటాకులు కాల్చి , స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.